క్లుప్తంగా

'విశ్వరూప మహాసభ' వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కథలాపూర్: ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించే 'విశ్వరూప మహాసభ' వాల్ పోస్టర్లను మండలంలోని చింతకుంటలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆవిష్కరించారు. ఎస్సీల వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, మాదిగలు, మాదిగ ఉప కులాల సభ్యులు అధికసంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు కాశవత్తుల లక్ష్మీరాజం, నల్లూరి కిషన్, దూడ రాజం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జ్ఞాపికలు ప్రదానం



జ్ఞాపికలు అందిస్తున్న భజరంగ్‌దల్‌సభ్యులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో దేవి శరన్న నవరాత్రి ఉత్సవాలు భజరంగ్‌దల్ శివాజీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించగా అమ్మవారి నిమజ్జనం ఊరేగింపులో సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరచిన చిన్నారులకు ఆదివారం జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో శివాజీ అసోసియేషన్ సభ్యులు కుంచల వెంకట్‌రాజ్, చింతం రాకేశ్, కట్కం సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

12 గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 12 గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు సీఈవో అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. భూషణరావుపేట, ఊటపెల్లి, పెగ్గెర్ల, రాజారాం తండా, చింతకుంట, కథలాపూర్, దుంపేట, దూలూర్, పోసానిపేట, కలిగోట, ఇప్పపెల్లి, అంబారిపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా మహేశ్



ఆటో యూనియన్ నూతన కార్యవర్గం

ధర్మపురి: ఆటో కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న లశెట్టి మహేశ్ ఐదోసారి యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. మహేశ్ వరుసగా నాలుగో ఏడాది ఏకగ్రీవంగా ఎన్నికయారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో 107 ఓట్లకు గాను 75 ఓట్లతో గెలుపొందాడు. అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడు సంపంగి రవి, వీరవేణి కొమురయ్య, కాశవేణి సాయిలు, అయ్యోరి లచ్చన్నను ఎన్నుకున్నారు. గెలుపొందిన వారిని పలువురు సన్మానించారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వెంకటేశ్



నూతన కార్యవర్గంతో నాయకులు

మేడిపల్లి: ఎమ్మార్పీఎస్ బీమారం మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలివేరి వెంకటేశ్ ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పసుల అంజని, ఉపాధ్యక్షులుగా మకిలీ కుమారస్వామి, సైదల రాజయ్యను నియమించారు. కార్యక్రమంలో యువజన సంఘాల అధ్యక్షుడు బంగారు దీపక్, కన్వీనర్ దుమాల గంగారాం, కాశవత్తుల లక్ష్మణ్, ఎర్రల రాజేశ్, ఎనుగంటి హరీశ్, నల్ల నర్సయ్య, గోపి, పాల్గొన్నారు.

ఓటర్లకు సౌకర్యాల కల్పనే లక్ష్యంగా..

- ధర్మపురి నియోజకవర్గంలో 269 పోలింగ్ కేంద్రాలు
- 26 మంది సెక్టోరియల్ అధికారుల నియామకం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

పెగడపల్లి: అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల నిర్వాహణ ఏర్పాట్లు పూర్తి కావొస్తున్నాయి. ఇప్పటికే ఓటరు దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, జాబితాల రూపకల్పన, తప్పుల సవరణ, తుది జాబితా విడుదల వంటి అంశాలు సైతం పూర్తయ్యాయి. నియోజవర్గంలోని 269 పోలింగ్ కేంద్రాలకు 26 మంది సెక్టోరియల్ అధికారులను (ఎస్‌వో) నియమించారు. వీరి పర్యవేక్షణలోనే పోలింగ్ కేంద్రాలకు తుదిరూపు దిద్దుతున్నారు.

269 పోలింగ్ కేంద్రాలు

నియోజవర్గంలో మొత్తం 269 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు పోలింగ్ కేంద్రాల దూరం, ఓటర్ల సంఖ్య అధారంగా సుమారు 12 నుంచి 15 కేంద్రాలకు ఒక సెక్టోరియల్ అధికారిని నియమించారు. ఎస్‌వోలు తమకు కెటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తూ సమస్యలను గుర్తిస్తున్నారు.

ఎస్‌వోలు గుర్తించే అంశాలు

ఎస్‌వోలుగా నియమితులైన అధికారులందరికీ పోలింగ్ కేంద్రాల నిర్వహణపై స్పష్టమైన నివేదికలు అందజేశారు. ఈ అధికారులు తమ పరిధిలోని కేంద్రాలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఓటింగ్ జరిగే రోజున వర్షం కురిసినా, ఎండ ఎక్కువగా ఉన్నా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏమైనా షెడ్లు ఉన్నాయా? లేకపోతే తాత్కాలికంగా టెంట్లను వేయడానికి వీలుందా లేదా చూడాలి. పోలింగ్ కేంద్రానికి సమీపంలో ప్రార్థన మందిరాలు ఉన్నాయా, కేంద్రానికి సమీపంలో ఎప్పుడైన మత కలహాలు గానీ, ఇతర అల్లర్లు ఏమైనా చోటు చేసుకున్నాయా అనే అంశాలపై ఆరా తీయాలి. పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు సరైన రోడ్లు వసతి ఉందా లేదా? ఒకవేళ లేకపోతే ప్రత్యామ్మాయ ఏర్పాట్లు చేయాలి. సమీపంలో 108 వాహనం, అగ్నిమాపక వాహనం, ఇతర అధికారుల వాహనాలు నిలిపి ఉంచేందుకు సరిపడా స్థలం ఉండేలా చూడాలి. పోలింగ్ నిర్వహణ కోసం ఒక రోజు ముందుగానే కేంద్రాలకు వచ్చే సిబ్బంది పడుకోవడానికి అవసరమైన గదులు, వారికి భోజనం ఇతర ఏర్పాటు చేయాలి. కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాలను సరైన స్థలంలో ఏర్పాటు చేసి, అక్కడ వెలుతురు సరిగా ఉండేలా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. పోలింగ్ కేంద్రాలకు టెలిఫోన్, ఇంటర్‌నెట్, మొబైల్ సిగ్నల్ వ్యవస్థలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా పక్కా ఏర్పాట్లు చేయాలి. పోలింగ్ కేంద్రాల సమీపంలో మినీ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ఓటరుకు ఏదైన ఆరోగ్య సమస్య తలెత్తితే తక్షణ వైద్యసాయం అందేలా చూడాలి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో నిశిత పరిశీలన చేసి పోలీసుల సహకారంతో ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేయాలి. అవసరమైతే గ్రామంలో పోలీసులతో కవాతు నిర్వహించాలి.

వీటితో పాటు మరిన్ని అంశాలను కూలంకుశంగా పరిశీలించి గుర్తించిన సమస్యలు, చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా నివేదిక తయారు చేస్తారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండటానికి పలు ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసుకుని వారితో తరుచూ సమావేశాలు నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలి.

సమస్యలు లేకుండా చర్యలు



ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నాం.

– దివాకర, అదిషనల్ కలెక్టర్, ధర్మపురి ఎన్నికల రిటర్నింగ్ అధికారి

చిత్ర కథ: పదేళ్లయినా భవనం పూర్తి కాలే..



సారంగాపూర్: మండలంలోని బట్టపల్లిలో 2013-14లో ప్రారంభించిన ఎస్సీ కమ్యూనిటీ భవనం పూర్తి కాకపోవడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బట్టపల్లిలో మెజార్టీ ప్రజలు దళితులు కావడంతో సంఘ భవనం ఏర్పాటు చేయాలని కోరగా, ప్రభుత్వం దశలవారిగా ఇప్పటి వరకు రూ.15 లక్షల వరకు మంజూరు చేసింది. సంఘ భవనంలో లోపల తలుపులు, కిటికీలు, విద్యుత్ ఫిట్టింగులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో పాటు మరుగుదొడ్లు, మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇటీవల రూ. 5 లక్షలతో సగం వరకు ప్రహరీ నిర్మాణం పూర్తి చేయగా, నిధుల లేమితో ప్రహరీ మధ్యలోనే ఆగిపోయింది. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టిసారించి భవన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడులు



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై, సిబ్బంది

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌లో ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఆదివారం గ్రామానికి చెందిన మొండి చంద్రమోహన్ అనే వ్యక్తి బెల్ట్‌షాపుపై దాడులు చేసి రూ.12 వేల విలువ గల 10 లీటర్ల మద్యం బాటిళ్లు పటుకున్నారు. పట్టుబడ్డ మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.

సమీకృతం బహుదూరం



సమీకృత మార్కెట్‌కు కేటాయించిన స్థలం


- ప్రారంభం కాని పనులు
- పత్తాలేని కాంట్రాక్టర్
- రూ.3 కోట్లు మంజూరు
- అందుబాటులో నిర్మించాలని అఖిలపక్ష నాయకుల డిమాండ్

రాయికల్: మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ కోసం ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ప్రభుత్వం ఎకరం 20 గుంటల భూమిని గుర్తించి సమీకృత మార్కెట్‌కు అప్పగించారు. పట్టణానికి చాలాదూరంగా ఉండటంతో కూరగాయల వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు సైతం కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూడం లేదని విమర్శలు వస్తున్నాయి.

అందుబాటులో నిర్మించాలని అఖిలపక్షం ధర్నా

సమీకృత మార్కెట్‌కు రూ.3 కోట్లు మంజూరు చేయగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. ఒకవైపు వ్యవసాయ మార్కెట్ ఆవరణలోనే సమీకృత మార్కెట్ నిర్మించాలని జిల్లా అధికార యంత్రాంగం పట్టుబడుతుండగా మరోవైపు ఇక్కడ నిర్మిస్తే పట్టణ ప్రజలకు రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదని దీనిపై అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు చేయడంతో కాంట్రాక్టర్ పనులు చేయకుండా వెళ్లిపోయాడు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.3 కోట్ల నిధులతో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా సమీకృత మార్కెట్ నిర్మించేలా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు



రాయికల్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సమీకృత మార్కెట్ కోసం ఎకరం 20 గుంటల స్థలాన్ని గుర్తించి అందించాం. దీని కోసం రూ.3 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. నోటీసులు జారీ చేస్తున్నాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

విశ్వబ్రాహ్మణ రాష్ట్ర మహాసభకు తరలిన నాయకులు



రాష్ట్ర మహాసభకు తరలివెళ్తున్న వెల్గటూర్ నాయకులు

వెల్గటూర్: హైదరాబాద్‌లో జరిగిన విశ్వబ్రాహ్మణ రాష్ట్ర మహాసభకు వెల్గటూర్ మండలం నుంచి విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు సంకోజు తిరుమల్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు, నాయకులు తరలివెళ్లారు. సభకు సుద్దాల రమేశ్, సంతోశ్, బ్రాహ్మండ్లపల్లి సతీష్, తొగిటి ప్రభాకర్, నందయ్య, సంతోష్, సత్యనారాయణ, విరణ్, శ్రీనివాస్, ఈశ్వర్, వీరబ్రహ్మచారి, సత్తయ్య, రాజశేఖర్ తదితరులు తరలివెళ్లారు.

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా?

- రోడ్డు వెంట స్తంభాలు.. ప్రమాదాల బారిన ప్రజలు
- తొలగించాలని కోరుతున్న ప్రజలు
- సారంగాపూర్- లక్ష్మీదేవిపల్లి అటవీప్రాంతంలో స్తంభాలు





లక్ష్మీదేవిపల్లి - సారంగాపూర్ మధ్య విద్యుత్ లైన్

సారంగాపూర్: నిత్యం రద్దీతో కూడుకున్న రహదారి...జగిత్యాల జిల్లా కేంద్రానికి సారంగాపూర్, బీర్‌పూర్ మండలాలతో పాటు మంచిర్యాల జిల్లా జన్నారం ప్రజలు ఈ రహదారి గుండా వెళ్తారు. సారంగాపూర్-లక్ష్మీదేవిపల్లి గ్రామాల మధ్య అటవీప్రాంతంలో ఈ రహదారి గుండా 2003–04లో సారంగాపూర్ సబ్‌స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లికి విద్యుత్ 11 కేవీ లైన్ వేశారు. అంతకుముందు అటవీప్రాంతంలోని 3 కిలోమీటర్ల సింగిల్ తారు రోడ్డు గుండా విద్యుత్ స్తంభాలు రోడ్డుపైనే ఏర్పాటు చేశారు. అటవీశాఖ అధికారులు అనుమతించకపోవడంతో విద్యుత్ స్తంభాలను రోడ్డు పక్కనే వేసి లైన్ నిర్మాణం పూర్తి చేశారు.

డబుల్‌రోడ్డు తరువాత పెరిగిన ప్రమాదాలు

2010–11 లో తారు రోడ్డును డబుల్‌రోడ్డుగా మార్చారు. దీంతో విద్యుత్ స్తంభాలు రోడ్డును అనుకుని ఉన్నాయి. అటవీప్రాంతంలో డబుల్‌రోడ్డు విస్తరణ తరువాత సారంగాపూర్ సబ్‌స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లికి వెళ్లిన విద్యుత్ స్తంభాలు డబుల్‌రోడ్డును అనుకుని ఉండడంతో రోజు రోజుకు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి.

స్తంభాన్ని ఢీకొట్టి మృతిచెందిన యువకుడు

మండలంలోని పోతారం గ్రామానికి చెందిన సింగం మహేశ్ (24) 2016లో రోడ్డు పక్కన ఉన్న స్తంభానికి ద్విచక్రవాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ తర్వాత చాలా మంది విద్యుత్ స్తంభాలను ఢీకొని గాయపడ్డారు. ఇటీవల సారంగాపూర్‌కు చెందిన కాలగిరి గురువర్ధన్‌రెడ్డి (17) గత సెప్టెంబర్ నెలలో స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు.

అధికారుల చర్యలు ఇలా...

వరుస ప్రమాదాలపై ఇంతకుముందు సబ్ కలెక్టర్ శశాంక కారణాలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. పోలీస్, విద్యుత్ శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖకు సూచనలు చేశారు. ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెంట అవసరమైన సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని, రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట వాహనదారుడు గంటకు 20 కిలోమీటర్లకు మించి వెళ్లకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని, కార్నర్‌ల వద్ద సైన్‌బోర్డులు, ఇతర సూచికలను ఏర్పాటు చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా పోలీస్‌శాఖ, ఆర్‌అండ్‌బీ శాఖ ఏర్పాట్లు చేసింది.

అధికారులు చర్యలు ప్రారంభించాలి

సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో రెండు సబ్‌స్టేషన్లు ఏర్పడిన తరువాత ఈ విద్యుత్ లైన్ సారంగాపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల సబ్‌స్టేషన్ల మధ్య విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు మాత్రమే ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగిస్తున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు వివరణ ఇస్తూ విద్యుత్ స్తంభాలు, లైన్లను షిఫ్ట్ చేయడంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని, వారి నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భయం భయంగా జీవనం

- గ్రామాల్లో వీధి కుక్కలు
- ఇళ్లల్లోకి చొరబడుతున్న వానరాలు





పెగడపల్లి: గ్రామాల్లో వీధి కుక్కలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. వానరాలు ఏ వైపునుంచి దాడి చేస్తాయో తెలియడం లేదు. విష పురుగులు ప్రాణాంతకమవుతున్నాయి. ఇలా మూడు రకాల జీవులు ప్రజలకు ముప్పతిప్పలు పట్టిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా గడిచిన ఆరు నెలల కాలంలో కుక్కలు, కోతుల దాడులు, పాము కాటుతో సుమారు 650 మందికి పైగా ప్రభుత్వ దవఖానాల్లో వైద్యం చేయించుకున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదకరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామపంచాయతీల పాలకులు కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు. కుక్క, కోతి కాటుకు గురైన వారు ఆలస్యం చేయకుండా రేబీస్ వ్యాక్సిన్ వేసుకోవాలని, మంత్రాలగాళ్ల పూజల పేరిట ఆలస్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని, వెంటనే వైద్య చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.